క్లుప్తంగా

29న దశ సహస్ర దీపోత్సవం

బోట్‌క్లబ్: మాస శివరాత్రి సందర్భంగా ఈ నెల 29న స్థానిక గొడారిగుంట జర్నలిస్ట్ కాలనీలో ఉన్న రమాసహిత సత్యదేవ మందిరంలో దశ సహస్ర దీపోత్సవం నిర్వహిస్తున్నట్టు మధ్వ పురోహితుడు యాతగిరి మధ్వేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం ఆరు గంటల నుంచి దీపోత్సవ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. తొలుత సంధ్యా పూజ, అనంతరం దీపోత్సవ పూజ నిర్వహించి, భక్తులందరితో దీప ప్రజ్వలన కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

జగన్మోహినీ అలంకరణలో సీతారామస్వామి



బోట్‌క్లబ్: రజిత చిన్న దశవతార అలంకార ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక మెయిన్ రోడ్డులో ఉన్న సీతారామస్వామి జగన్మోహినీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి ఉదయం అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో యండమూరు చిన్నారుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచ్, హెచ్‌ఎం, గ్రామస్తులు

కరప: రామచంద్రపురంలో ఆదివారం జరిగిన 24వ ఏపీ స్టేట్ ఇన్విటేషనల్ కరాటే చాంపియన్‌షిప్-2024 పోటీలలో మండలంలోని యండమూరు మండల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభతో బంగారు, రజత పతకాలు సాధించారు. పోటీలలో బ్లూ బెల్ట్ విభాగంలో యండమూరు పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థిని పి.హన్సిక బంగారు పతకం, నాలుగో తరగతి విద్యార్థినియు.సిరి రజత పతకం సాధించినట్టు కరాటే మాస్టారు యు.లోవరాజు సోమవారం ఇక్కడ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను, తర్ఫీదునిచ్చిన కరాటే మాస్టారు లోవరాజును సర్పంచ్ మార్నెళ్ల శ్రీనివాసరావు(శివ), హెచ్‌ఎం కె.సరస్వతి, పాఠశాల చైర్మన్ పి.శ్రీనివాస్, వైస్ చైర్మన్ యు.సరోజిని అభినందించారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

కాకినాడ సిటీ: ఇంటర్మీడియేట్ పాస్, ఫెయిలైన నిరుద్యోగ యువతీయువకులు స్థానిక భానుగుడి సెంటర్‌లోని సైన్స్ కంప్యూటర్స్ ఇన్ఫోసిస్ ఫౌండేషన్‌లో సీఎస్ఆర్ పథకం ద్వారా ఉచిత శిక్షణ పొందవచ్చని సంస్థ డైరెక్టర్ జంగం బాబ్జి ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉన్నవారు అర్హులన్నారు. ట్యాలీ, కంప్యూటర్ అసిస్టెంట్, రిటేల్ కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. 15 రోజుల శిక్షణ పూర్తయ్యాక సర్టిఫికెట్ ఇస్తారన్నారు. ఈ శిక్షణ ఈ నెల 27 నుంచి ప్రారంభిస్తామని తెలిపారు.

ఆదిత్య డెవలపర్స్ కార్యాలయం ప్రారంభం



ఆదిత్య డెవలపర్స్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి సోమవారం కాకినాడలో ఆదిత్య డెవలపర్స్ కార్యాలయాన్ని ప్రారంభించారు. తన సతీమణి లక్ష్మీ రాజ్యం చేతుల మీదుగా మొదటి బ్రోచర్ ఆవిష్కరింపజేశారు. ఆయన మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులకు జ్ఞానాన్ని అందించి, వారి జీవితాలను తీర్చిదిద్దడంలో ఆదిత్య విద్యాసంస్థ తోడ్పడిందన్నారు. దాని ప్రతిఫలంగా దేశ విదేశాల్లో వారి వృత్తులలో స్థిరపడటం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరికీ సొంత ఇంటికల ఉంటుందని, అలాంటి వారందరికీ అందుబాటులో ఉండే విధంగా పెద్దాపురంలో ఆదిత్య గ్రీన్‌సిటీ పేరుతో వెంచర్లు ప్రారంభించామన్నారు. ప్రశాంత వాతావరణంతో పాటు, పచ్చటి వనాల మధ్య ఎలాంటి ధ్వని కాలుష్యం లేని ప్రాంతంలో ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య యూనివర్సిటీ వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, నల్లమిల్లి భీమేశ్వరరెడ్డి, వీరభద్రరెడ్డి పాల్గొన్నారు.

గోమాయ శాల..!

- ఇష్టారాజ్యంగా ఆవుల ధారాదత్తం
- కళావిహీనంగా గోశాల
- గ్రాసం కూడా భారమైన వైనం
- సర్పవరం ఆలయంపై తీవ్ర నిర్లక్ష్యం
- పెత్తనం చలాయిస్తున్న పాలకపక్ష నేతలు



సర్పవరం భావనారాయణ స్వామి ఆలయానికి చెందిన గోశాల దుస్థితి

కాకినాడ రూరల్: గోవులు లక్ష్మీ స్వరూపమంటారు.. గోవులను పూజిస్తే సకల దేవుళ్లను పూజించినట్టు హిందువులు భావిస్తారు. అటువంటి గోవులకు నిలయంగా భాసిల్లిన సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయ గోశాల నేడు కళావిహీనంగా మారిపోయింది. ఎల్లప్పుడూ 60కి పైగా గోవులతో కళకళలాడే గోశాల నేడు 18 జీవాలకు మాత్రమే పరిమితమైంది. కనీసం గ్రాసం కూడా సమకూర్చలేని దుస్థితిని ఎదుర్కొంటోంది.

సర్పవరం భావనారాయణ స్వామి ఆలయం ఎదురుగా కొద్ది దూరంలో గోశాల ఉంది. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీ గ్రామ నాయకుడు పుల్ల చందు ప్రత్యేక శ్రద్ధతో గోవులకు దాణా, గ్రాసం సమకూర్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆలయంపై జనసేన నాయకుల పెత్తనం నడుస్తోంది. వైఎస్సార్ సీపీ నాయకులపై అంక్షలతో వారు ఆలయం, గోశాల వైపు వెళ్లడం లేదు.

మేలు జాతి ఆవులు మాయం

గోశాలలో ఒకప్పుడు సుమారు 60 వరకు గోవులు ఉండగా, వీటిలో 12 వరకు చనిపోయాయి. మిగిలిన వాటిలో జనసేన నేతల సిఫార్సులతో గత ఈఓ హయాంలో రెండు నెలల క్రితం మేలు జాతి ఆవులను ఇష్టారాజ్యంగా ధారాదత్తం చేసేశారు. ప్రస్తుతం 18 గోవులు మాత్రమే ఉండగా, వీటిలో ఆవులు కంటే.. గిత్తలు, దూడలే ఎక్కువగా ఉన్నాయి. ఆలయ గోశాలలోని గోవులను బయట వారికి ఇచ్చేందుకు ఎండోమెంట్ కమిషన్ లేదా ఆర్‌జేడీ అనుమతి కచ్చితంగా తీసుకోవాల్సి ఉంది. గ్రాసం కొరత,, నిర్వహణ భారం పేరుతో రైతులకు ఉచితంగా అందజేస్తున్నట్టు ఆర్‌జేడీకి లేఖ రాసి, ఎటువంటి అనుమతులు లభించకుండానే గోవులను పంపిణీ చేసేశారు.

బడ్జెట్ ఉన్నా..

గోశాలలో గోవుల గ్రాసం కోసం రూ.2 లక్షల నిధుల బడ్జెట్ ఉన్నప్పటికీ, గ్రాసం కొనుగోలు చేయలేదు. గోవుల కాపలా కోసం కాపరికి నెలకు రూ.15 వేల వరకు జీతాన్ని ఆలయం చెల్లిస్తోంది. గోశాలను ఆనుకుని విశాలమైన స్థలం ఉంది. గోవుల పెంపకానికి ఇబ్బంది లేదు, దీనిపై అప్పటి ఆలయ గత ఈవో భీమేశ్వరరావు గోశాలలో గోవుల పోషణ భారంగా ఉండడంతో గ్రామంలో రైతులకు మేత కోసం ఇచ్చామని, తిరిగి అప్పగిస్తారని సమాధానం దాట వేశారు. నేటికీ అవి తిరిగి రాలేదు. సనాతన ధర్మానికి విలువ ఇచ్చే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు చెందిన జనసేన పార్టీ నేతలే.. చేను కంచె మేసినట్టుగా గుడిపై పెత్తనం చలాయించడాన్ని భక్తులు, గ్రామస్తులు ముక్కున వేలేసుకుంటున్నారు.

చేతివాటానికీ యత్నం!

రాగి నాణేలు కాజేసేందుకు యత్నం: భావనారాయణ స్వామి ఆలయం గోపురంపై శిఖరం దెబ్బతినడంతో ఇటీవల దాతల సహాయంతో సమకూర్చిన శిఖరాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. పాత శిఖరం తొలగించే క్రమంలో కొన్ని రాగి నాణేలు బయటపడ్డాయి. వాటిని కొత్తగా తయారు చేసిన శిఖరాన్ని ప్రతిష్ఠించేటప్పుడు అందులో పొందుపర్చాల్సి ఉండగా, గ్రామానికి చెందిన జనసేన నేత ఒకరు వాటిలోని కొన్ని నాణేలపై చేతివాటం ప్రదర్శించాడు. ఇది గమనించిన భక్తుల ద్వారా సమాచారం అందుకున్న అర్చకులు, మరో నేత సీరియస్‌గా స్పందించి, వాటిని వెనక్కి రప్పించి, గోపురంలో శిఖరం ప్రతిష్ఠించిన గోతిలో వేశారు. నాణేలు చేతివాటం యత్నం సర్పవరంలో కథలుగా చెప్పుకొంటున్నారు.

> **పూర్వ వైభవానికి కృషి**
>
> సర్పవరం ఆలయ గోశాలలో ప్రస్తుతం 18 గోవులు ఉన్నాయి. వీటిలో మేలు రకం గోవులు లేవు. కేవలం రెండు ఆవులు ఉండగా, మిగిలినవి దూడలు, గిత్తలు ఉన్నాయి. గతంలో గోశాల నుంచి ఇచ్చిన గోవులు తిగిరి ఎవరూ అప్పగించలేదు. గ్రాసం రెండు సార్లు రప్పించాను. గోశాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తాను. ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు, నిత్య అన్నదానం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవలే నేను బదిలీపై వచ్చినందున ఆలయ అభివృద్ధిపై దృష్టి పెడుతున్నాను. చేపల చెరువు లీజు రద్దు చేసి కొత్తగా వేలం పెట్టే ఆలోచన చేస్తున్నాం.
>
> – మాచిరాజు లక్ష్మీనారాయణ, ఈఓ, సర్పవరం భావనారాయణ స్వామి ఆలయం

వైభవంగా సహస్ర కలశాభిషేకం



కలశాలతో అభిషేకం చేస్తున్న కేరళ అయ్యప్పస్వామి ఆలయ ప్రధాన అర్చకులు



కలశాభిషేకం కోసం సిద్ధం చేసిన కలశాలు

బోట్‌క్లబ్: నగరంలోని రామారావుపేటలో ఉన్న మరకత పీఠంలో సోమవారం సహస్ర కలశాభిషేకం వైభవంగా జరిగింది. పీఠం ఏర్పాటు చేసి 12 వసంతాలు పూర్తయిన సందర్భంగా వేలు గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి సహస్ర కలశాభిషేకం, సట్‌కోన యంత్ర పూజ నిర్వహించారు. ఉదయం శబరిమలై ఆలయ ప్రధాన పూజారి ఆధ్వర్యంలో తొలుత వెయ్యి కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలశాలతో స్వామి వారికి ఆయనే స్వయంగా అభిషేకం చేశారు. పీఠం వ్యవస్థాపకుడు నందమూరి వినోద్ గురుస్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని కుడా చైర్మన్ తుమ్మల బాబు, టిడ్కో చైర్మన్ వేములపాటి అజేయ్‌కుమార్ దర్శించుకున్నారు. సాయంత్రం స్వామి వారి శోభాయాత్ర ఘనంగా జరిగింది. స్వామి వారిని ప్రత్యేక రథంపై ఉంచి రామారావుపేటలోని పలు వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం రవి గురుస్వామి ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన పూజ నిర్వహించారు. అయ్యప్ప స్వామి 18 మెట్లకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పంచ హారతులు అందించారు. అధిక సంఖ్యలో అయ్యప్పదీక్షాపరులు పాల్గొన్నారు.

కూరాడలో కార్తిక దీపాల సంబరం



కూరాడలో వెలిగిస్తున్న కార్తిక దీపాలు



కరపలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కరప: మండలంలోని కూరాడలో సోమవారం రాత్రి కార్తిక దీపాల సంబరం ఘనంగా నిర్వహించారు. కూరాడలో కార్తిక మాసంలో చివరి సోమవారం రాత్రి దీపాలసంబరం జరపడం ఆనవాయితీగా వస్తోంది. సంబరం రోజున నాలుగు సరుగుడు రాటలతో అరపను తయారు చేసి, వెదురు బద్దలతో అరలుగా చేస్తారు. అందులో జిగురుమట్టి ఉంచి, దానిపై ప్రమిదలు పెట్టి నూనె, వత్తులతో వెలిగిస్తారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో రేయింబవళ్లు సంబరం జరిపారు. కూరాడ, పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి కార్తిక దీపాలను వెలిగించారు.

కరపలో..

కార్తిక దీపాల సంబరాన్ని కరపలో కూడా నిర్వహించారు. వారం రోజులు ముందు నుంచి శివ,పార్వతులను నిలిపి, కరప, గొల్లకోటివారిపాలెం, దంగేరు, రాజమహేంద్రవరం, శ్రీరంగపట్నం భజన బృందాలతో 5వ శ్రీరామ సప్తాహం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీపాల సంబరం రోజున సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బ్యాండ్‌మేళంతో శివపార్వతులను గ్రామంలో ఊరేగించారు. రాత్రి కార్తిక దీపాలను వెలిగించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కరప, పరిసర గ్రామాల నుంచి భక్తుల తరలివచ్చి కార్తిక దీపోత్సవాన్ని తిలకించారు.

ఆక్రమణ, అక్రమాలపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు



ఉప్పలంక గ్రామ సమస్యలపై గ్రామస్తులతో కలిసి ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ నయోమి

కరప: మండలంలోని ఉప్పలంకలో ఉన్న కాలభైరవ స్వామివారి ఆలయ భూమి ఆక్రమణతో పాటు, ఉపాధి హామీ పథకంలో వేతనాల చెల్లింపులో జరిగిన అవకతవకలపై సోమవారం సర్పంచ్ బొమ్మిడి నయోమి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొమ్మిడి సతీష్ కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో, గ్రామస్తులతో కలిసి కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినట్టు సర్పంచ్ నయోమి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూచ కాలభైరవ స్వామి గుడి కార్యకలాపాలు నిర్వహించేందుకు స్వామి భక్తుడు దివంగత కాలెపు ఆనందరావు సర్వే నంబరు 106/1ఎలో రెండు ఎకరాల భూమిని రాసిచ్చారన్నారు. ఇందులో మూడొంతులకు పైగా ఆక్రమణకు గురైందని చెప్పారు. ఆక్రమణదారులు ఆ స్థలంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు యత్నిస్తున్నారన్నారు. అధికారులు సర్వే చేసి, ఆక్రమణదారుల నుంచి భూమిని స్వాధీనం చేసుకోవాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

వేతనాల చెల్లింపుల్లో అక్రమాలు

అలాగే ఉప్పలంక గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా 2005–2009 మధ్య కాలంలో చేసిన పనులకు, చెల్లించిన వేతనాల్లో అక్రమాలు జరిగాయని, వాటిపై విచారణ జరపాలని గ్రామస్తులు ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోలేదని సర్పంచ్ తెలిపారు. సతీష్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఉప్పలంక గ్రామస్తులకు ఇళ్ల స్థలాల కోసం తాళ్లరేవు మండలం చొల్లంగిలో పట్టాలిచ్చినట్టు తెలిపారు. వారికి స్థలాలు అప్పగించాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఆయా అంశాలపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు చేశామని సర్పంచ్ నయోమి తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై సునీత

కరప: సమాజంలో ఇటీవల కాలంలో సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై టి.సునీత అన్నారు. కరపలో సోమవారం రాత్రి జరిగిన కార్తిక దీపాల సంబరంలో ఆర్కెస్ట్రా స్టేజ్‌పై ఆమె ఏఎస్సై వి.సూరిబాబుతో కలిసి సైబర్ నేరాల తీరుతెన్నులు, మోసాలను వివరించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసినా, ఎవరైనా ఉద్యోగం ఇస్తామని మాయమాటలు చెప్పినా నమ్మవద్దన్నారు. డిజిటల్ అరెస్ట్ చేశామని పోలీసు యూనిఫారంలో ఎవరైనా వీడియోకాల్ చేసి చెప్పినా నమ్మవద్దని సూచించారు. సైబర్ మోసాలు ఎలా జరుగుతున్నాయో, సొమ్ము ఎలా పోగొట్టుకుంటున్నారో ఆమె అవగాహన కల్పించారు.

కలెక్టరేట్ వద్ద సీపీఎం ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం శ్రేణులు

కాకినాడ సిటీ: పారిశ్రామిక దిగ్గజం అదానీని తక్షణమే అరెస్టు చేయాలని, అతడి కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు జి.బేబీరాణి, నగర సభ్యులు కె.సత్తిరాజు మాట్లాడుతూ, అంతర్జాతీయంగా మన దేశ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న అదానీని మోదీ ప్రభుత్వం వెనకేసుకురావడం సమంజసంగా లేదన్నారు. హిడెన్ బర్గ్ రిపోర్టు వచ్చినప్పుడే అదానీ సంస్థలపై తగిన చర్యలు తీసుకుని ఉంటే పరిస్థితి ఇంత వరకు వచ్చి ఉండేది కాదన్నారు. నిజాయితీపై పదేపదే మాట్లాడే చంద్రబాబు.. అదానీ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసి, చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. అదానీ కంపెనీలకు లాభాలు చేకూర్చేలా, రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారాలు మోపేలా ఒప్పందాలు చేసిన ఉన్నతాధికారులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పలివెల వీరబాబు, మలక వెంకటరమణ, చంద్రమళ్ల చంద్ర, నర్ల ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 8న ఐలాజ్ మహాసభ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బుగతా శివ, విశ్వేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు

కాకినాడ లీగల్: ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) తొలి రాష్ట్ర మహాసభ వచ్చే నెల 8న కాకినాడ జిల్లా అన్నవరంలోని శ్రీశేషాద్రి సదన్‌లో జరుగుతుందని సంస్థ కన్వీనర్ బుగతా శివ తెలిపారు. దీనికి న్యాయవాదులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. మహాసభ ప్రచార కరపత్రాన్ని సోమవారం కాకినాడ అసోసియేషన్ హాలులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు, కార్యదర్శి చెక్క శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఐలాజ్ కన్వీనర్ బుగతా శివ, సీనియర్ న్యాయవాదులు ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా న్యాయవాదుల ప్రయోజనాలు, ప్రజల హక్కులను కాపాడటంలో ఐలాజ్ ముందుంటుందన్నారు. కోర్టుల్లో ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాదులకు సౌకర్యాలు, ప్రయోజనాలు కల్పించాలని కోరారు. న్యాయవాదులకు రక్షణ చట్టం తేవాలని, న్యాయ విద్య విద్యార్థులకు కనీస వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మానవ హక్కుల కోసం,పౌర హక్కుల కోసం పోరాడే న్యాయవాదులపై ప్రభుత్వాలు నిరంకుశ నల్ల చట్టాలను ప్రయోగించడం ఆపాలని ఐలాజ్ పిలుపు ఇస్తోందన్నారు. 60 ఏళ్లు పైబడిన న్యాయవాదులకు స్టైఫండ్ ఇవ్వాలని తదితర డిమాండ్లతో మహాసభను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ శంకర్ శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు బి.రాజేష్, సయ్యద్ సాలార్, జె.వెంకటేశ్వర్లు, పి.కమల, ఉమామహేశ్వరరావు, ఎస్.వీరభద్రరావు, ఐలాజ్ సభ్యుడు జోగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దామోదరుడికి జ్యోతిర్లింగార్చన



శివాలయంలో ఏర్పాటు చేసిన శివలింగం



జ్యోతిర్లింగార్చనలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగి తురంగేశ్వర ఆలయంలో హరోం హర నినాదాలతో శివభక్తుల ఆధ్వర్యంలో పది వేల దీపాలతో దామోదరునికి అత్యంత ఘనంగా జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. సోమవారం రాత్రి ఈ కార్యక్రమాన్ని హరహర మహాదేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగింది. ఓం త్రిశూలం ఢమరుకం తదితర అలంకారాలను ఏర్పాటు చేశారు. స్వయంభూ భోగి గణపతి పీఠం వ్యవస్థాపక ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు కాజా సత్యవీర ప్రసాదరావు మాట్లాడుతూ, పదేళ్లుగా కార్తిక మాసం ఆఖరి సోమవారం పది వేల దీపాలతో జ్యోతిర్లింగార్చన నిర్వహణను లోక కల్యాణార్థం కొనసాగిస్తున్నామన్నారు. శివాలయం చుట్టూ భక్తులు పెద్దఎత్తున జ్యోతి ప్రజ్వలన చేశారు.

శివనామ స్మరణం.. సర్వపాప హరణం

- కిటకిటలాడిన శైవ క్షేత్రాలు
- దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు




దేవాలయం వీధిలోని పెద్ద శివాలయంలో శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు



భానులింగేశ్వర స్వామికి నిర్వహిస్తున్న అభిషేకం



కరప శివాలయంలో రామలింగేశ్వర స్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు



కరప విష్ణాలయంలో ప్రత్యేకాలంకరణలో వేణుగోపాలస్వామి

బోట్‌క్లబ్: శివునికి ఎంతో ప్రీతికరమైన కార్తిక సోమవారం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. తెల్లవారుజాము నుంచి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచలి కార్తిక్ ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము మూడు గంటల నుంచి ఆలయంలో అభిషేకాలు నిర్వహించేందుకు భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. ఆలయంలోని కుమారస్వామి ఆలయంలో అయ్యప్ప దీక్షాపరులు 41 రోజుల దీక్ష పూర్తి చేసుకొని ఇరుముడి కట్టుకొన్నారు దీంతో ఆలయ ప్రాంగణం అయ్యప్ప దీక్షాపరులతోను, వారి కుటుంబ సభ్యులతో కిటకిటలాడింది. స్థానిక భానులింగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు దర్శనం కోసం క్యూలు కట్టారు. తెల్లవారుజాము నుంచే భక్తులు దర్శనం కోసం క్యూలు కట్టారు. స్వామి వారిని సుమారు ఐదు వేల మంది భక్తులు దర్శించుకున్నారు. సుమారు రెండు వేల మంది అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రామారావుపేటలోని శివాలయంలో దర్శనం కోసం భక్తులు క్యూలు కట్టారు. ఉచిత దర్శనంతో పాటు, రూ.20, రూ.30 దర్శనాలు ఏర్పాటు చేశారు. ఉచిత దర్శనం కోసం సుమారు గంట సేపు క్యూలైన్‌లో నిలబడాల్సి వచ్చింది. స్థానిక సాంబమూర్తినగర్‌లోని శివాలయం, స్థానిక శ్రీనగర్‌లోని శివాలయంలోను భక్తులు దర్శనం కోసం క్యూలు కట్టారు.

ఆలయాల్లో శివ నామస్మరణ

కరప: మండలంలోని శివాలయాలు కార్తికమాసం చివరి సోమవారం శివ నామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే స్వామివారికి అభిషేకాలు చేయించే భక్తులతో శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. స్థానిక పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజామున 4 గంటల నుంచే పూజాది కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ప్రధాన అర్చకులు విలపర్తి శ్రీనివాస్, రాజు స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజాదికాలు నిర్వహించారు. విష్ణాలయంలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈఓ కె.తిరుమల రవితేజ భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. చిన మామిడాడలోని పంచముఖేశ్వర స్వామి ఆలయంలో వంశపారంపర్య ధర్మకర్త ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెనుగుదురు, అరట్లకట్ట, వేములవాడ, పెద్దాపురప్పాడు, వేళంగి, నడకుదురు, గురజనాపల్లి, వాకాడ, కొరిపల్లి, కూరాడ, గొర్రిపూడి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు తాకిడి పెరిగింది.